సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 1 । జూలై । 2023



పట్టణ పేదలకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండి

పట్టణ ప్రాంతం పేదల విద్య, వైద్య, ఆరోగ్యం వంటి అంశాలలో ప్రభుత్వం మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. -IIలో



నైపుణ్యంతో కూడిన బోధన

సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నైపుణ్యంతో కూడిన బోధన ఉంటుందని ఆ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. -IIలో

7న జెడ్పీ సర్వసభ్య సమావేశం

విజయనగరం గంటస్తంభం: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7న నిర్వహించనున్నట్టు జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ కె.రాజకుమార్ తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా పరిషత్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

న్యూస్‌రీల్

ముగిసిన స్కిల్ టెస్ట్‌లు



కుమరాం కేజీబీవీలో డెమో క్లాస్‌ను పరిశీలిస్తున్న కేజీబీవీల రాష్ట్ర కార్యదర్శి గీత

జామి: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులు కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు జామి మండలం కుమరాం కేజీబీవీలో మూడురోజులుగా నిర్వహించిన స్కిల్ టెస్ట్‌లు శుక్రవారంతో ముగిశాయి. డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, డైట్ ప్రిన్సిపల్ తిరుపతి నాయుడు, జీసీడీఓ మాలతి, ఏఎంఓ ప్రసాద్, కుమరాం కేజీబీవీ ప్రత్యేక అధికారి బి.జ్యోతి బృందం అభ్యర్థులకు స్కిల్‌టెస్ట్‌లు నిర్వహించింది. ఈ ప్రక్రియను కేజీబీవీల రాష్ట్ర కార్యదర్శి గీత పర్యవేక్షించారు. అభ్యర్థుల డెమో క్లాస్‌లను పరిశీలించారు. చివరి రోజు పీఈటీ, పీజీటీ సీఎస్, జీఎఫ్‌సీ, మ్యాథ్స్, ఫిజియోథెరపీ, పీఎస్‌టీటీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, సీఆర్టీ హిందీ, సోషల్, తెలుగు సబ్జెక్టులకు సంబంధించిన 42 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

స్కిల్‌హబ్‌లో ఉచిత శిక్షణ

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సీతంపేట ప్రభుత్వ ఐటీఐలోని స్కిల్‌హబ్‌లో ఫోర్‌వీలర్ టెక్నీషియన్, స్వింగ్ మెషిన్ ఆపరేటర్ (టైలరింగ్) కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఎనిమిదో తరగతి/ఐటీఐ చదివిన విద్యార్థులకు శిక్షణకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రముల జిరాక్సులు, రెండు పాస్‌ఫొటోలు, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో కూడిన దరఖాస్తును సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో రెండురోజుల్లో దరఖాస్తు అందజేయాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్: 79937 95796, 70320 60773 నంబర్లను సంప్రదించాలన్నారు.

డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురం: ఫిజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫిజికల్‌సైన్స్ టీచింగ్ డైరీని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ బోధించే ఉపాధ్యాయులు సులభ పద్ధతుల్లో, పాఠ్యాంశాలపై విద్యార్థులు పట్టుసాధించేలా బోధన సాగించాలన్నారు. కార్యక్రమంలో ఫోరం తరపున లక్ష్మణ్, కిరణ్, మల్లికార్జున్, సతీష్, రాజు, శ్రీనివాస్, అసోక్, తిరుపతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

గిజబ చేరుకున్న గజరాజులు



గిజబలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: మండలంలోని గిజబ పరిసర ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తున్నాయి. కొద్దిరోజులుగా కొమరాడ మండలంలోని దుగ్గి, కళ్లికోట, మార్కొండపుట్టి తదితర గ్రామాల్లో సంచరించిన ఏనుగులు మరలా గిజబ పొలాల్లో శుక్రవారం దర్శనమిచ్చాయి. అరటి, మొక్కజొన్న పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఏనుగులు మళ్లించే ఏర్పాట్లు చేయాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు–2023కు జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల15వ తేదీలోగా http:// nationawardsteacher.education.go-v.in వెబ్‌సైట్‌లో ప్రతిపాదనలు పంపించాలన్నారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండలపరిషత్, మున్సిపాలిటీ, ఎయిడెడ్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు/ప్రధానోపాధ్యాయులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ రక్ష... జగనన్న సురక్ష



పార్వతీపురం పట్టణంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు

జిల్లాలో నిర్వహించనున్న శిబిరాలు	
జిల్లా జనాభా	9,25,340
గ్రామ సచివాలయాలు	312
వార్డు సచివాలయాలు	38
అందజేసే సేవలు	11

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యం
- జగనన్న సురక్ష కింది ఇంటింటి సర్వే పూర్తి
- నేటి నుంచి ఆగస్టు 1 వరకు సర్టిఫికెట్ల జారీ
- అర్హత ఉండి పథకాలు అందనివారిని గుర్తింపు
- 350 సచివాలయాల పరిధిలో సర్టిఫికెట్ల జారీకి ఏర్పాట్లు

పార్వతీపురంటౌన్: సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు... సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువచేసింది. కుల, మత, ప్రాంత, రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేకూరుస్తోంది. జిల్లాలో 90 శాతం కుటుంబాలు ఏదో ఒక ప్రభుత్వ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయి. నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వ పథకాల కింద జిల్లాలోని లబ్ధిదారులకు వేలకోట్ల రూపాయల ప్రయోజనం కల్పించింది. తాజాగా జగనన్న సురక్ష సర్వే కింద పథకాలు అందని వారిని జల్లెడపడుతోంది. ఇప్పటికే సర్వే పూర్తికాగా, వివిధ ధ్రువపత్రాలు, ప్రభుత్వ సేవలను అర్హులకు శనివారం నుంచి అధికారుల బృందం అందజేయనుంది.

ఇంటింటికీ వలంటీర్లు

2011 జనాభా లెక్కల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలో 9,25,340 లక్షల మంది ఉన్నారు. జిల్లాలోని 312 గ్రామ సచివాలయాలు, 38 వార్డు సచివాలయాల పరిధిలోని వలంటీర్లు జూన్ 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లారు. ప్రజలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? అనే విషయం తెలుసుకున్నారు.

సేవలు ఇలా..

ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం, కౌలు రైతులకు సంబంధించిన క్రాప్‌కల్టివేటర్ రైట్స్ కార్డు (సీసీఆర్సీ), రైస్‌కార్డు, హౌసింగ్ సంబంధిత పత్రాలను సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల ద్వారా అధికారులు ఎలాంటి సేవా రుసుములు వసూలు చేయకుండా ప్రజలకు ఉచితంగా అందజేస్తారు.



పాలకొండ పట్టణంలో సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు, సచివా

ఒకవేళ ఎవరికైనా అర్హత ఉండి పథకాలు అందకపోతే వారి పేర్లు నమోదు చేశారు. వారికి ఏ పథకం అవసరమో, అందుకు ఏయే ధ్రువీకరణపత్రాలు అవసరమో గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, సేవల గురించి ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నేటి నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించిన ధ్రువపత్రాలు జారీ చేయనున్నారు.

అధికార బృందాల నియామకం

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాల వద్ద ప్రత్యేక శిబిరాల నిర్వహణకు మండల స్థాయిలో రెండు బృందాలను నియమించారు. ఒక బృందంలో ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్, ఇతర అధికారులు ఉంటారు. మరో బృందంలో తహసీల్దార్, ఈఓపీఆర్డీ తదితరులు ఉంటారు. ఏదైనా మండలంలో గ్రామ సచివాలయాలు 24కు మించి ఉంటే మండల స్థాయి అధికారి ఆధ్వర్యంలో అదనంగా మరో బృందాన్ని ఏర్పాటు చేస్తారు. మండల స్థాయిలో నిర్వహించే ఈ క్యాంపుల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, నియోజ కవర్గ ప్రత్యేక అధికారి, డివిజనల్ స్థాయి అధికారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొనాల్సి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో మూడు బృందాలు ఏర్పాటు చేస్తారు. మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ తహసీల్దార్, ఇతర సిబ్బంది ఒక బృందంగా ఉంటారు. జోనల్ కమిషనర్ లేదా డిప్యూటీ కమిషనర్, ఇతర సిబ్బంది మరో బృందంగా ఉంటారు. క్యాంపుల్లో ప్రజల నుంచి స్వీకరించే అర్జీలను డిజిటల్ అసిస్టెంట్ ద్వారా డేటా ఎంట్రీ చేయిస్తారు. తర్వాత 15 నుంచి 30 రోజుల్లోపు ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేసేలా చర్యలు చేపట్టారు.

శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



జగనన్న సురక్ష శిబిరాల నిర్వహణకు చర్యలు చేపట్టాం. అర్హత కలిగి సంక్షేమ పథకాలు పొందని వారంటూ ఉండరాదన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. జిల్లాలోని 350 సచివాలయాల్లో శిబిరాల నిర్వహణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాం. మండల పరిధిలో రెండు, పట్టణ పరిధిలో మూడు అధికార బృందాలను ఏర్పాటు చేశాం. నేటి నుంచి శిబిరాలు నిర్వహిస్తాం.

– రామచంద్రరావు, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి, పార్వతీపురం మన్యం

ఇంటర్ సర్కిల్ రోమింగ్ అవసరం



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో నిర్మిస్తున్న టవర్లకు ఇంటర్ సర్కిల్ రోమింగ్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞప్తిచేశారు. జిల్లా కలెక్టర్లతో జవహర్‌రెడ్డి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ ఇంటర్ సర్కిల్ రోమింగ్ ఏర్పాటు చేయడం వల్ల ఒక నెట్‌వర్క్‌కు సంబంధించిన సిమ్‌ను ఇతర నెట్‌వర్క్‌లతో వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు. దీని వల్ల నెట్‌వర్క్ సమస్యలు తీరడంతోపాటు ప్రజలపై ఆర్థిక భారం పడదని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ టవర్ల పనులు ప్రారంభించాల్సి ఉందని తెలిపారు. జవహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు. జూలై 7వ తేదీ వరకు అమ్మఒడి కార్యక్రమాన్ని మండల స్థాయిలో నిర్వహించాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, డీఈఓ ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అలరించి.. మురిపించి..



విద్యార్థినుల థింసా నృత్య ప్రదర్శన



- సంబరంగా యువజనోత్సవం
- ఆకట్టుకున్న నృత్యప్రదర్శనలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, అధికారులు

విజయనగరం: సంప్రదాయ, జానపద నృత్య ప్రదర్శనలతో అలరించి.. మురిపించారు.. పద్య రచనల్లో ప్రతిభ చూపారు.. అబ్బురపరిచే చిత్రలేఖనంతో ఆకట్టుకున్నారు.. ఫొటోగ్రఫీలో సృజనాత్మకతను ప్రదర్శించారు.. వక్తృత్వపోటీల్లో వాక్పటిమకు పదునుపెట్టారు.. విజయనగరం ఎం.ఆర్.ఎడ్యుకేషన్ కళాశాల వేదికగా శుక్రవారం జరిగిన యువజనోత్సవాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచి బహుమతులు సొంతం చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన సర్వీసులు క్రీడా మంత్రిత్వశాఖ పరిధిలోని నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో నగరంలో జరిగిన జిల్లా స్థాయి యువ ఉత్సవ్–2023 సందడిగా సాగింది. '2047 నాటికి అభివద్ధి చెందిన దేశంగా భారత్' అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, చిత్రలేఖనం, పద్యరచన, ఫొటోగ్రఫీ, సంప్రదాయ, జానపదనృత్యం అంశాల్లో జరిగిన పోటీల్లో యువతీయువకులు ప్రతిభ చూపారు. వక్తృత్వం, సంప్రదాయ నత్యం అంశాల్లో మొదటి ముగ్గురు విజేతలకు రూ.5,000, రూ.2,500, రూ.1250, ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, పద్యరచన పోటీల్లో విజేతలకు వరుసగా రూ.1000, రూ. 750, రూ.500 చొప్పున జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు వెలికితీసేందుకు యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. యువతకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు జెడ్పీ నుంచి పూర్తి తోడ్పాటు ఉంటుందన్నారు. యువత ఉన్నత స్థానా లకు చేరుకోవడమే లక్ష్యంగా చేపట్టే కార్యక్రమాలకు సహకరిస్తామని చెప్పారు. ఇప్పటికే జిల్లాలో జరుగుతున్న అగ్నివీర్ ఎంపికకు హాజరయ్యే యువతకు శిక్షణ ఇచ్చి సన్నద్ధం చేసేందుకు జెడ్పీనిధులు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్, ఎం.ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎన్‌రాజు, సెట్విజ్ సీఈఓ రాంగోపాల్, డీఐపీఆర్ఓ డి.రమేష్, ఎన్‌వైకేఏఓ పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.గోవిందరావు, జిల్లా ఉపాధి అధికారి డి.అరుణకుమారి తదితరులు పాల్గొ న్నారు. డ్యాన్స్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రాధికారాణి వ్యవహరించారు.

విజేతలు వీరే..

చిత్రలేఖనం: డి.భీష్మ, జి.పవిత్ర, జి.పుష్పలత
పద్యరచన: ఇ.కావ్య, డి.సృజన, యు.చైతన్య
మొబైల్ ఫొటోగ్రఫీ: బి.శివ, యు.కృష్ణవంశీ, వై.పవన్‌కుమార్
వక్తృత్వం: ఎ.హర్షసాయి, టి.శ్వేత, ఆర్.రజిత
నృత్యం: తన్మయి గ్రూప్, ప్రశాంతి టీమ్, లిఖిత గ్రూప్

సబ్‌కలెక్టర్ ఔదార్యం



క్షతగాత్రుడికి తన సిబ్బందితో కలిసి సపర్యలు చేస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి పాలకొండ సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్ సహాయం అందించి స్థానికుల అభినందనలు అందుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సబ్ కలెక్టర్ వీరఘట్టం రహదారిలో శుక్రవారం ఉదయం ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న పాలకొండ పట్టణానికి చెందిన నీలాపు రమేష్‌ను తంపటాపల్లి సెంటర్ వద్ద ఎదురుగా వస్తున్న కారు బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడి రోడ్డుమీద పడిపోయాడు. అటుగా వెళ్తున్న కలెక్టర్ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే వాహనం నిలిపారు. గాయపడిన వ్యక్తికి సపర్యలు చేశారు. కారులో ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. తహసీల్దార్ పి.సోమేశ్వరావు, సర్వేయర్ పి.వెంకటరావులను క్షతగాత్రుడికి తోడుగా పంపించారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

- విజేతలకు బహుమతుల ప్రదానం



రాష్ట్ర స్థాయి చెస్ పోటీల విజేతలతో చెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు

విజయనగరం: జిల్లా వేదికగా మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెస్‌పోటీలు శుక్రవారంతో ముగిశాయి. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–7 వయస్సు విభాగంలో బాల, బాలికలకు నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు చెస్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు పి.మస్తాన్‌బాబు, కోశాధికారి కె.వి.జ్వాలాముఖి బహుమతులను ప్రదానం చేశారు. ఉత్కంఠ భరితంగా సాగిన పోటీల్లో బాలుర విభాగంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఎస్.శ్రీసాయివిభు ప్రథమ స్థానం దక్కించుకోగా.. కోనసీమకు చెందిన జి.వెంకటశివరామ్ ద్వితీయ స్థానాన్ని చేజిక్కించుకున్నాడు. బాలికల విభాగంలో తిరుపతికి చెందిన వి.మోదితరెడ్డి ప్రథమ స్థానం కైవసం చేసుకోగా... కోనసీమకు చెందిన సీహెచ్ పోసాన రితికాఅక్షయ ద్వితీయ స్థానంలో నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సెప్టెంబర్ 20వ నుంచి 25వ తేదీ వరకు పశ్చిమబెంగాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ ఫణికుమార్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎ.రావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం: బాలల సంక్షేమ కమిటీ, జువైనెల్ జస్టిస్ బోర్డులో సభ్యుల నియామకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బాలల సంక్షేమశాఖ జిల్లా పర్యవేక్షణ అధికారి ఎం.శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల రక్షణ, సంరక్షణ చట్టం–2015 (సవరించబడిన చట్టం–2021) ప్రకారం ఏపీలో కొత్తగా ఏర్పాటుచేసిన జువైనెల్ జస్టిస్ బోర్డుకు జిల్లాల్లో చైర్మన్లు, సభ్యులు, సోషల్ వర్కర్స్‌గా సేవలందించేందుకు అర్హతగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. గత నెల 14న నోటిఫికేషన్ విడుదలైందని, ఈ నెల 13లోగా ఆసక్తిగల అభ్యర్థులు 'సంచాలకులు, బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ కేరాఫ్ ప్రభుత్వ అబ్జర్వేషన్ హోం ఫర్ బోయ్స్, డోర్ నంబర్ 3-1-255/4/ఎ విద్యాధరపురం, విజయవాడ 520012కు దరఖాస్తులు పంపించాలన్నారు. విద్యార్హతలు, ఎంపిక విధానం ఇతర వివరాలకు హెచ్‌టీటీపీ://డబ్ల్యూడీ,సీడబ్ల్యూ.ఏపీ.జీఓవీ.ఇన్‌లో చూసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 79817 22198ను సంప్రదించాలన్నారు.

6 నుంచి సదరం స్లాట్‌ల బుకింగ్

విజయనగరం ఫోర్ట్: దివ్యాంగులు పింఛన్లు పొందేందుకు అవసరమైన సదరం సర్టిఫికెట్ కోసం సదరం స్లాట్స్ ఈ నెల 6వ తేదీ నుంచి అందుబాటులో ఉంటాయని డీసీహెచ్ఎస్ డాక్టర్ బి.గౌరీశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై నుంచి సెప్టెంబర్ నెలవరకు స్లాట్స్‌ను బుక్ చేసుకోవచ్చన్నారు.

అభినందనల జల్లు



విద్యార్థిని మనస్విని శాలువతో సత్కరిస్తున్న పెద్దలు

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం వేదికగా గతనెల 28న జగనన్న అమ్మ ఒడి నిధులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి పాల్గొన్న సభావేదికపై గుమ్మలక్ష్మీపురం కేజీబీవీ బాలిక మనస్విని ప్రసంగంతో ఆకట్టుకుంది. విద్యార్థులకు భరోసాగా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించి సీఎంతోపాటు మంత్రులు, నాయకులు, అశేష ప్రజానీకాన్ని ముగ్ధులను చేసింది.

ఇందులో భాగంగా గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బి.గౌరీశంకర్ నేతృత్వంలో వైస్ ఎంపీపీ ఎం.శేఖర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, పలువురు పెద్దలు కేజీబీవీలో మనస్వినిని సత్కరించారు. అభినందనలతో ముంచెత్తారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు అమలుచేస్తోందన్నారు. విద్యార్థులందరూ సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వర్తక సంఘ అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

డెంకాడ: చింతలవలస ఏపీఎస్‌పీ ఐదవ బెటాలియన్‌లో ఉన్న ఎస్‌వీఎస్ ఏపీఎస్‌పీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ ప్రైమరీ ఒకటి,1 నుంచి 5వ తరగతి వరకూ సైన్స్ టీచర్-1, 6 నుంచి 10వ తరగతి వరకూ సోషల్ టీచర్-1 అటెండర్, ఆయా 1 పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తి ఉన్న వారు జూలై 7వ తేదీ లోగా దరఖాస్తుతో పాటు బయోడేటా, విద్యార్హతలను జత చేసి ఎస్‌వీఎస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అందజేయాలని తెలియజేశారు. డైట్,బీఈడీ అర్హత కలిగి ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం పాఠశాల హెచ్ఎం అప్పారావు సెల్ నంబర్ 7013641401,అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.రామునాయుడు సెల్ నంబర్ 9573184185ను సంప్రదించాలని సూచించారు.

ముద్దాయికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష

జామి: అసభ్యకర సందేశాలు, ఫొటో మార్ఫింగ్‌లతో ఒక మహిళను వేధింపులకు గురిచేసినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి 8ఏళ్ల జైలు శిక్ష,రూ.40 వేలు అపరాధ రుసుం విధిస్తూ ఎస్.కోట జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎం.ఎస్,ఎస్.వాణి తీర్పునిచ్చారు. ఈ మేరకు ఎస్సై వీరబాబు శుక్రవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని శిరికిపాలెం గ్రామానికి చెందిన కుంచంగి రఘు సార్ వేధింపులు తట్టుకోలేక 2016వ సంవత్సరంలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు. ఈ మేరకు పోలీసులు ముద్దాయిని విశాఖ సెంట్రల్‌జైలుకు తరలించారు.

పట్టణ పేదలకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండి

- నేటి నుంచే పంపిణీ



గోధుమ పిండి ప్యాకెట్‌ను ఇటీవల విడుదల చేసిన మంత్రులు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు

విజయనగరం అర్బన్: పట్టణ ప్రాంతం పేదల విద్య, వైద్య, ఆరోగ్యం వంటి అంశాలలో ప్రభుత్వం మొదటి నుంచి ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. వైద్య సేవల విషయంలో చంద్రబాబు మూసేసిన అర్బన్ హెల్త్ సెంటర్లను ఇప్పటికే పునఃప్రారంభించి డాక్టర్లను నియమించి కార్పొరేట్‌కు దీటుగా నిర్వహిస్తోంది. పట్టణ పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రోటీన్స్ పుష్టిగా ఉన్న ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ చేస్తోంది. తాజాగా గోధుమల పంపిణీలో వినూత్న ప్రయోగం చేపట్టింది. ప్రోటీన్స్ కలిపి గోధుమలను పిండి చేయించి ఫోర్టిఫైడ్ గోధుమ పిండిగా మార్చి ప్యాకెట్ రూపంలో రాయితీ ధరలో పంపిణీ చేయనుంది.



విజయనగరంలో ప్రజాపంపిణీ వ్యవస్థ వాహనం వద్ద కార్డుదారులు

కిలో రూ.16కు అందజేత

జూలై నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో రేషన్ డిపోల ద్వారా కిలో రూ.16 చొప్పున ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీకి సిద్ధమైంది. ఫోర్టిఫైడ్ చక్కీ గోధుమపిండిలో ఐరన్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ బి12 వంటి సూక్ష్మ పోషకాలు ఉంటాయి. ఎఫ్ఎస్ఎస్ఏఐ 2006 నిర్దేశిత ప్రమాణాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పంపిణీకి స్థానిక విజయనగరం వీట్ ప్రొడక్ట్స్ మిల్లు ఈ ప్యాకెట్స్ రూపొందిస్తుందని ప్రజా పంపిణీ వ్యవస్థ అధికారులు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా గోధుమ పిండిని పంపిణీ చేయడానికి ముఖ్యమంత్రి యోచిస్తున్నారు. నాలుగు పట్టణాల్లో 92,935 కార్డుదారులకు వర్తింపు జిల్లాలోని నాలుగు పట్టణ ప్రాంతాల్లో గల 92,935 తెల్ల కార్డు దారుల పేద కుటుంబాలకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు కిలో ప్యాకెట్ వంతున 92.935 మెట్రిక్ టన్నుల గోధుమ పిండి అవసరం ఉంటుంది.



ఫోర్టిఫైడ్ గోధుమ పిండి ప్యాకెట్

మున్సిపాల్టీల్లో గోధుమపిండి పంపిణీ

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో పట్టణ ప్రాంతాలైన పార్వతీపురం, పాలకొండ, సాలూరులో జూలై 1 నుంచి ఫోర్టిఫైడ్ గోధుమ పిండి పంపిణీ చేయనున్నామని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని దశలవారీగా అన్ని చౌక ధరల దుకాణాలవద్ద సరఫరా చేస్తామని చెప్పారు. పార్వతీపురం పట్టణంలో 11,291 మంది, పాలకొండలో 7,884మంది, సాలూరులో 13,736మంది తెల్ల రేషన్‌కార్డుదారులున్నారని, వారందరూఇకీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ఆటో నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి చీపురుపల్లి రోడ్డులో తిమ్మయ్యపేట వద్ద ఆటో గురువారం రాత్రి రోడ్డుపై గోతిలో దిగడంతో అదుపు తప్పి అందులో ప్రయాణిస్తున్న వ్యక్తి జారి పడి గాయాలు పాలయ్యాడు. ఏఎస్ఐ భాస్కరరావు తెలిపిన వివరాలు.. మండల పరిధి పెనుబాక గ్రామానికి చెందిన జినగం పార్వతీశం రాజాం వచ్చి పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు రాత్రి 10 గంటల సమయంలో ఆటోను ఆశ్రయించాడు. ఆటో స్పీడుగా వెళ్లడంతో పాటు గోతిలో దిగడంతో అదుపు తప్పి పడిపోయాడు. గాయాలతో రోడ్డుపై పడి ఉన్న పార్వతీశంను అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి రాజాం కేర్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా ఇదే ప్రాంతంలో రెండు రోజుల క్రితం ప్రమాదాల బారిన పడి ఇరువురు వ్యక్తులు గాయాలపాలైన విషయం విదితమే.

ఎనిమిది మంది పందెగాళ్ల అరెస్ట్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఆత్మారాముని అగ్రహారంలో నిర్వహిస్తున్న కోడి పందాలపై దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేశామని ఎస్సై నారాయణరావు శుక్రవారం తెలిపారు. ఎస్పీ దీపికా పాటిల్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ఏటీ అగ్రహారం గ్రామ శివారులో సోదాలు చేపట్టామన్నారు. నిందితుల నుంచి కోడి పుంజు, 22,610 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సకాలంలో ఎరువుల పంపిణీకి ముందస్తు ప్రణాళిక

- ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ పాండే



మాట్లాడుతున్న ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ పాండే

విజయనగరం అర్బన్: రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడానికి అవసరమైన ప్రణాళికలను ముందస్తుగా వేసుకుని మార్క్‌ఫెడ్‌కి పంపాలని ఏపీ మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ పాండే అన్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్-2023లో సహకార సంఘాలు, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడానికి ప్రణాళికలు ముందస్తుగా వేసుకోవాలని సూచించారు. మూడు జిల్లాల్లోని మార్కెటింగ్ కమిటీల గోదాములు ఎరువుల వ్యాపారానికి అద్దెకు ఇచ్చి అందుబాటులో ఉంచాలని కోరారు. రాష్ట్రంలో రైతుభరోసా కేంద్రాల ద్వారా 10.50 లక్షల మెట్రిక్ టన్నులు పీఏసీలు, డీసీఎంఎస్‌ల ద్వారా 7.2 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు పంపిణీ చేయడానికి లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నానో యూరియాపై అవగాహన

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రైతులకు కావలసిన ఎరువులు సకాలంలో పంపిణీ చేసేందుకు విజయనగరం, బొబ్బిలి డిపోల ద్వారా యూనియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులు సిద్ధం చేస్తున్నామని వివరించారు. రైతులకు అవగాహన లేనందున ఐఎఫ్ఎఫ్‌సీ, నానో యూరియాను వినియోగించేందుకు సంకోచిస్తున్నారని ఈ కారణంగా నానో యూరియా వినియోగంపై అవగాహన కల్పించడానికి డీసీఎంఎస్ ద్వారా కార్యక్రమం చేపడతామని తెలిపారు. జిల్లాలో సహకార సంఘాల వ్యాపార వ్యవహారాలలో డీసీఎంఎస్ అండగా ఉంటుందన్నారు. సహకార సంఘాల బలోపేతానికి సహకరించే అవకాశం ఇచ్చినందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి డీసీఎంఎస్ కృతజ్ఞతలు తెలియజేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మూడు జిల్లాల వ్యవసాయ అధికారులు, సహకార అధికారులు, బిజినెస్ మేనేజర్లు, సహకార సంఘాల సీఈఓలు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు వద్దు..



స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న ఆర్‌టీఓ అధికారులు

విజయనగరం క్రైమ్: ఆటో, క్యాబ్‌లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రాకపోకలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన కూడళ్ల వద్ద పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులను తీసుకువచ్చే ఆటోలతో పాటు ప్రయాణికుల ఆటోలు, క్యాబ్‌లను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఎక్కువ మందితో రాకపోకలు సాగిస్తున్న డ్రైవర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌టీఓలు దుర్గాప్రసాద్, ఎస్.రమేష్, కేఆర్ఎస్.ప్రసాద్, ఎంవీఐలు శ్రావ్య, ఐశ్వర్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి దశల వారీగా నిధులు

- మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఎస్వీ మురళీ కృష్ణారావు

బొబ్బిలి: పట్టణంలోని రహదారుల అభివృద్ధికి దశల వారీగా నిధులు కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో సాధారణ, అత్యవసర సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు అధ్యక్షత వహించిన చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు మాట్లాడుతూ, రాజా కాలేజ్ రహదారికి మరమ్మతులు చేపట్టనున్నట్టు చెప్పారు. అనంతరం అజెండాలో పొందుపరిచిన అంశాలను చర్చించారు. బుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంక్‌కు కేటాయించిన స్థలం ప్రేమనగర్ కాలనీ అభివృద్ధికి కేటాయించినదని మరో చోట ఈ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించాలని కోరారు. ఈ అంశాన్ని వాయిదా వేయాలని కౌన్సిలర్ తెంటు పార్వతి కోరడంతో సభ్యులు ఆమోదించారు. పట్టణంలోని రహదారులకిరువైపులా ఉన్న ఆక్రమణలను దశల వారీగా తొలగించనున్నట్టు టీపీఓ ఓ. వరప్రసాదరావు ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సమావేశంలో కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దూరవిద్య పరీక్షలు ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం యూజీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులు రెండవ, మూడవ సంవత్సరం, డిప్లమో ఇన్ మ్యూజిక్(ద్వితీయ సంవత్సరం) పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు దూరవిద్య సంచాలకుడు ఆచార్య కె.విశ్వేశ్వరరావు తెలిపారు. మూడవ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, రెండవ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా 46 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను https://www.andhrauniversity&sde.com/ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960-00
బంగారం(22సి. 10గ్రా.)	54,050-00
వెండి (కిలో)	75,700-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹137	₹244	₹ 254

సెంచూరియన్‌లో నైపుణ్యంతో కూడిన బోధన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సెంచూరియన్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు, తదితరులు

- యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు

నెల్లిమర్ల రూరల్: సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నైపుణ్యంతో కూడిన బోధన ఉంటుందని ఆ వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డీఎన్ రావు అన్నారు. ఈ మేరకు మండలంలో టెక్కలి సెంచూరియన్‌లో నూతన కార్యవర్గం బాధ్యతలు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలో పాత పద్ధతుల్లో కాకుండా ఆచరణాత్మక విధానంలో బోధన ఉంటుందని చెప్పారు. ఇతర విశ్వ విద్యాలయా లకు భిన్నంగా నైపుణ్యాలను అలవర్చుకునేలా విద్యార్థులను సిద్ధం చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వనరులు సెంచూరియన్‌లో పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. వర్సిటీని ఏర్పాటు చేయాలని ఇతర రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వస్తున్నాయని చెప్పారు. వ్యవసాయ గోపురాలు తయారు చేసేందుకు ఆస్ట్రేలియా నుంచి సంబంధిత పరిశ్రమ ప్రతినిధులు ముందుకొచ్చారన్నారు. ఇక్కడ తయారు చేసిన గోపురాలను ఇతర దేశాలకు ఎగుమతి చేయనున్నామని వివరించారు. ఇక నుంచి చాన్స్‌లర్‌గా ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, వైస్ చాన్స్‌లర్‌గా పీకే మహంతి, రిజిస్ట్రార్‌గా డాక్టర్ పల్లవి కొనసాగనున్నారని స్పష్టం చేశారు. చాన్స్‌లర్ జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ..నాక్ గుర్తింపు సామర్థ్యానికి తగ్గట్టుగా అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామని, చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమణారావు, డీన్‌లు ఆచార్యులు, కృష్ణమూర్తి, సన్నీడియోల్, డిప్యూటీ రిజిస్ట్రార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్రమిత వ్యాధుల వివరాలు నమోదు చేయాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కరరావు



క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: సంక్రమిత వ్యాధులైన డెంగీ, మలేరియాలను గుర్తిస్తే ఐహెచ్ఐపీ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు పేర్కొన్నారు. నగరంలోని క్వీన్స్ ఎన్ఆర్ఐ, మహేంద్ర హాస్పిటల్, పీజీ స్టార్ ఆస్పత్రులను శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ గడువు పూర్తయితే వెంటనే రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఏ వ్యాధికి ఎంత ఫీజు వసూలు చేస్తారో బోర్డులు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎపిడిమాలజిస్టు డాక్టర్ జి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


వ్యాధుల వ్యాప్తిపై అవగాహన కల్పించండి

వ్యాధుల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు పేర్కొన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం ఎంపీహెచ్‌ఈఓలు, ఎంపీహెచ్ఎస్ (ఫిమేల్), ఎంపీహెచ్ఎస్ (మేల్) ఆశ నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించినప్పుడు వ్యాధుల వ్యాప్తి గురించి తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగీ, టైఫాయిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో వ్యాధులు వ్యాపించిన వెంటనే పీహెచ్‌సీ వైద్యాధికారికి తెలియజేసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య లోపం గ్రామాల్లో లేకుండా చూడాలన్నారు. సమావేశంలో డీఐఓ శృతి, జిల్లా మలేరియా అధికారి వై.మణి, డీసీహెచ్ఎస్ఓ మామిడి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



సంఘటనా స్థలంలో మృతిచెందిన రాజు



క్లీనర్ అప్పలరాజు మృతదేహం

విజయనగరం క్రైమ్: నగరంలోని కోట జంక్షన్ వద్ద గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడడంతో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఫూల్‌బాగ్‌కు చెందిన ఎస్.రాజు (29) గురువారం రాత్రి సెకెండ్ షో అనంతరం 1.30 ప్రాంతంలో స్నేహితుడితో కలిసి కోట జంక్షన్‌కు వచ్చేసరికి బైక్ స్కిడ్ అవ్వడంతో రోడ్డుపై పడిపోయారు. ఈ ఘటనలో రాజు తల రోడ్డుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి త్యాగరాజు ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై భాస్కరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ కింద పడి క్లీనర్..

సాలూరు: మున్సిపాలిటీలోని వేంకటేశ్వర కాలనీకి చెందిన లారీ క్లీనర్ ప్రమాదవశాత్తు తాను పని చేస్తున్న లారీ కింద పడి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లారియూనియన్ ఆఫీసు ఎదురుగా అప్పుడే ముందుకు కదులుతున్న లారీని ఎక్కేందుకు క్లీనర్‌గా పనిచేస్తున్న అప్పలరాజు ప్రయత్నిస్తున్న క్రమంలో అదుపు తప్పి జారిపడిపోయాడు. దీంతో లారీ చక్రం కిందకు వెళ్లిపోవడంతో నలిగిపోయి అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస రావు తెలిపారు.

మృతుడి వివరాలు లభ్యం

బొండపల్లి: మండలంలోని బొండపల్లి గ్రామం సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన గురువారం మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి వివరాలు శుక్రవారం తెలిసినట్లు రైల్వే ఎస్సై రవివర్మ తెలిపారు. మృతుని నిది మండలంలోని గరుడుబిల్లి గ్రామానికి చెందిన మజ్జి లక్ష్మణరావుగా తెలిసినట్లు చెప్పారు. మృతుడికి భార్యదేవితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. కుటుంబసభ్యులు గుర్తించడంతో మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని సర్వజన కేంద్రాస్పత్రికి తరలించి పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.